క్లుప్తంగా

## మంత్రి తుమ్మలకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

**ఖమ్మం వన్‌టౌన్:** ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో జూలై 10న నిర్వహించనున్న జగన్నాథ్ రథ యాత్ర మహోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరుతూ మండలంలోని శ్రీసిటీ వాసులు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇస్కాన్ బృందం ఖమ్మం అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఖమ్మం వచ్చిన వారికి వరంగల్ నుండి తీసుకొచ్చిన భోజనం అందిస్తున్నారని, ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మంత్రి చొరవ తీసుకుని కిచెన్ షెడ్ ఏర్పాటు చేయాలని కోరడంతో కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

**తుమ్మలను కలిసిన కార్పొరేటర్లు**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం కార్పొరేటర్లు ఆళ్ల అంజిరెడ్డి, మేడారపు వెంకటేశ్వర్లులు కలిశారు. ఈ మేరకు తమ డివిజన్ అభివృద్ధి పనులతో పాటు అగ్రహారం అండర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

## నేడు న్యాయవాదులకు తరగతులు

**ఖమ్మం లీగల్:** 'ఐలూ' రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన న్యాయవాదులకు శనివారం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో వృత్తి నైపుణ్య తరగతులు ఏర్పాటుచేశారు. ఈ తరగతుల్లో పాల్గొనేందుకు ఇప్పటికే జిల్లా నుంచి పలువురు న్యాయవాదులు పేర్లు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కల్పించనుండగా, తరగతుల నిర్వహణను జిల్లాకు చెందిన బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

## ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక


అక్షయ

**రఘునాథపాలెం:** ఎన్ఎంఎంఎస్(నేషనల్ మెరిట్) స్కాలర్‌షిప్ 2023–24 సంవత్సరానికిగాను రఘునాథపాలెం పాఠశాల విద్యార్థిని గుగులోత్ అక్షయ ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. 8వ తరగతిలో నిర్వహించే ఈ పోటీ పరీక్షల్లో జాతీయ ప్రతిభా పురస్కార్ అవార్డుకు ఎంపికై 4 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ప్రతిభా పురస్కారం పొందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థిని ఎంఈఓ ఎం.శ్రీనివాస్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

## గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

**రఘునాథపాలెం:** రఘునాథపాలెంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 6నుంచి 9వ తరగతి వరకు నాన్ మైనార్టీ విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు హెచ్ఎం స్వాతి తెలిపారు. ఈ మేరకు పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నందున 6, 7, 8వ తరగతుల్లో డ్రా ద్వారా, 9వ తరగతిలో పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ జిరాక్స్, ఇతర సర్టిఫికెట్లతో శనివారం నుంచి 19వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**రఘునాథపాలెం:** మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన బోడా నాగేశ్వరరావు(35) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. బీటెక్ చదివిన ఆయన కొన్ని రోజులు ఒక ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించాక ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై గ్రామసెంటర్‌కు వెళ్లిన ఆయన గుండెపోటుకు గురయ్యాడు. దీంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## చిన్నారులను ప్రీ స్కూల్‌లో చేర్పించాలి

**కామేపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు ప్రతీ చిన్నారిని ప్రీ స్కూల్‌లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి అన్నారు. శుక్రవారం మండలంలోని పండితాపురం గ్రామంలో కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ మండలాల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆటపాటలతో విద్య నేర్పడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ముప్పును తొలగించేలా..

**నగరవ్యాప్తంగా కోనోకార్పస్ మొక్కల తొలగింపు**

- పర్యావరణానికే కాక ప్రజారోగ్యానికి ముప్పుగా గుర్తింపు
- ఆలస్యంగా మేల్కొన్న కేఎంసీ అధికారులు
- వాటి స్థానంలో పగడ, మహాగణి, బాదం మొక్కలు నాటేలా చర్యలు


రాపర్తినగర్ బైపాస్‌లో కోనోకార్పస్ మొక్కలను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించే పనిని చేపట్టారు. ఈ మొక్కలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆలస్యంగానైనా కార్పొరేషన్ అధికారులు స్పందించారు. 20 రోజుల క్రితం ఒకసారి బోనకల్ రోడ్డులోని కొన్ని మొక్కలను తొలగించారు. ఎన్నికల విధులు పూర్తి కావడంతో గురువారం నుంచి ఈ మొక్కలపై మరోసారి దృష్టి సారించారు. నగర వ్యాప్తంగా ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని మున్సిపల్ ఉన్నతాధికారులు డీఆర్ఎఫ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

**లక్షకు పైగానే..**

కార్పొరేషన్ అధికారులు హరితహారం కార్యక్రమాల్లో భాగంగా కోనోకార్పస్ మొక్కలను విరివిగా నాటారు. నగర వ్యాప్తంగా డివైడర్లు, వాక్‌వేలు, ట్యాంక్‌బండ్‌ల చుట్టూ, ప్రభుత్వ స్థలాల్లో, రోడ్ల వెంట సుమారు లక్ష వరకు ఈ మొక్కలు నాటారని పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు. త్వరగా ఎదిగి పచ్చగా కనిపిస్తున్నాయనే ఉద్దేశంతో మూడు, నాలుగేళ్లుగా నగరంలో కోనోకార్పస్ మొక్కలను నాటుతూ వచ్చారు. అయితే ఇవి పెరుగుతున్న కొద్దీ వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్న క్రమంలో వీటి తొలగింపునకు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ మొక్కలు నాటేందుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భారీగానే ఖర్చు చేశారు. మొక్కలను బయట నర్సరీల నుంచి ప్రత్యేకంగా కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటారు. డబ్బులు ఖర్చు చేసి మరీ పర్యావరణ సమతుల్యాన్ని అధికారులు దెబ్బతీశారనే విమర్శలు వెల్లువెత్తాయి.

**ఇతర రకాలు...**

నగరంలో కోనోకార్పస్ మొక్కలను తొలగించేందుకు డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి మొక్కలను తొలగించే కార్యక్రమం మొదలైంది. నగరంలోని రాపర్తినగర్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు బైపాస్‌లోని డివైడర్ల మధ్య, ముస్తఫానగర్ నుంచి ధంసలాపురం వరకు డివైడర్ల మధ్య నాటిన ఈ మొక్కలను ఇప్పటికే తొలగించారు. ఒకే రోజే 2200 మొక్కల వరకు తొలగించినట్లు సిబ్బంది తెలిపారు. అయితే తొలగించిన మొక్కల స్థానంలో డివైడర్లలో మహాగని, పగడా మొక్కలను నాటడమే కాక... రోడ్ల వెంట, ఇతర స్థలాల్లో వీటికి తోడు బాదం మొక్కలను నాటాలని కార్యాచరణ రూపొందించారు. వర్షాలు విరివిగా కురిసిన తర్వాత మొక్కలను నాటాలని అధికారులు నిర్ణయించారు.

### పర్యావరణానికి విఘాతం..

కోనోకార్పస్ మొక్కలతో పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తుతాయని వృక్ష శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వీటి ప్రభావంతో శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ మొక్క పుష్పాల నుంచి వెలువడే పుప్పొడి వల్ల అలర్జీ, శ్వాసకోశ, ఆస్తమా సమస్యలు వస్తాయని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలినట్లు తెలుస్తోంది. అలాగే ఈ మొక్కల వేర్లు లోతుకంటూ పాతుకుపోవడంతో మధ్యలో అడ్డు వచ్చే కమ్యూనికేషన్ కేబుల్స్, డ్రెయినేజీ లైన్లు, మంచినీటి వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయని గుర్తించారు.


ఎన్నెస్పీ క్యాంపులో బస్టాండ్ రోడ్డు వైపు కోనోకార్పస్ మొక్కలు

ఈ మొక్కలతో ఉపయోగం లేకపోగా.. దుష్ప్రభావాలు మాత్రం కలిగిస్తోంది.

### కొత్త మొక్కలను నాటాలి



కోనోకార్పస్ మొక్కలను నాటవద్దని, నాటినవి తొలగించాలని గతంలోనే సూచించాం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని మొక్కలను తొలగించడం సంతోషం. అయితే, తొలగించిన మొక్కల స్థానంలో నీడను, పండ్లను ఇచ్చే ఇతర రకాల మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలి.

– కడవెండి వేణుగోపాలరావు, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత

# నగరంలో ఎంపీ పర్యటన


వరుడితో ఎంపీ రఘురాంరెడ్డి, మతపెద్దలు

**ఖమ్మంవన్‌టౌన్:** ఖమ్మం నగరంలో ఎంపీ రఘురాంరెడ్డి శుక్రవారం పర్యటించారు. ముస్లిం మత పెద్ద ముఫ్తీ మహమ్మద్ జలాలుద్దీన్ ఖాస్మీ కుమారుడి వివాహం సందర్భంగా నగరంలోని ఈఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన వలీమా వేడుకలకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హాజరై వరుడు ఉసామాను ఆశీర్వదించారు. నాయకులు నూకల నరేష్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్‌రావు, షేక్‌మియా భాయ్, జహీర్ అలీ, ఇలియాజ్, నజీముద్దీన్ తదితరులు హాజరయ్యారు.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి వర్ధంతి వరంగల్‌లో నిర్వహించగా ఎంపీ రఘురాంరెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర విద్యా, మౌళిక వసతుల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కొప్పుల చంద్రశేఖర్‌రావులు ఉన్నారు.

**ఎంపీని కలిసిన వరంగల్ మాజీ మేయర్**

ఎంపీ రఘురాంరెడ్డిని వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ దంపతులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సదస్సు పోస్టర్లు ఆవిష్కరణ

**ఖమ్మం మామిళ్లగూడెం:** నేడు రిజర్వేషన్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు అంశంపై ఈనెల 15న ఖమ్మంలో ఐఎంఏ హాలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని వీర నారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉపేంద్రాబాయి, ఝాన్సీ, గౌరవాధ్యక్షురాలు షేక్ నజీమా కోరారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జయ, స్పందన, జ్యోతి, యాకలక్ష్మి, లలితబాయి, నాగమణి, నీలవేణి, జాన్‌బీ, పార్వతి పాల్గొన్నారు.


## టెండర్ నిలిపివేయాలి

**నేలకొండపల్లి:** స్థానిక బస్టాండ్ స్థలంను లీజ్‌కు ఇచ్చేందుకు పిలిచిన టెండర్లను వెంటనే నిలిపివేయాలని ఇఫ్టూ ఏరియా పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం స్థానిక దాతలు అందించిన స్థలాన్ని ఆర్టీసీ నష్టాలలో ఉందని చెప్పి లీజ్‌కు ఇవ్వటం సరికాదన్నారు. బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## నివాళి..

**ఖమ్మంగాంధీచౌక్:** ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ కిరాణ శాఖ సభ్యులు దాత్రిక అశోక్(73) మృతి చెందగా పలువురు శుక్రవారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, కిరాణం శాఖ అధ్యక్షులు అర్వపల్లి నవీన్‌కుమార్, సభ్యులు కాకరపర్తి రాంప్రతాప్, కేసా గోపాల్, కురువెళ్ల రమేష్ ఉన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం


రఘునాథపాలెం: అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఎంఈఓ, హెచ్ఎంలు తదితరులు

**రఘునాథపాలెం:** బడి ఈడు పిల్లలు బడుల్లోనే ఉండాలని ఎంఈఓ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బడిబాటలో భాగంగా రఘునాథపాలెం మండలంలోని గణేశ్వరంలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షుడు ఎమ్.సుశీల, హెచ్ఎం కె.విజయశ్రీ, ఉపాధ్యాయులు గోపాలరావు, జ్యోతి, అనంత్, విజయలక్ష్మి, సీఆర్పీ ఎం.వీరయ్య, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కూసుమంచి:** బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు.

**నేలకొండపల్లి:** మండలంలోని చెరువుమాధారం అంగన్‌వాడీ కేంద్రంలో బండిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఎస్. కనకదుర్గ, సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కూసుమంచి: జుజుల్‌రావుపేటలో..


నేలకొండపల్లి: చెరువుమాధారంలో..


## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఖమ్మంవ్యవసాయం:** నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వివిధ సెక్షన్ల ఆపరేషన్ అధికారులు ప్రకటించారు. ఖమ్మం టౌన్–1 పరిధిలోని గాంధీచౌక్ 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎమ్మార్వో కార్యాలయం, సాయిరాం థియేటర్ రోడ్, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ రోడ్, ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి, గాంధీచౌక్, పీఎస్ఆర్ రోడ్ సుందర్ మ్యాక్స్ థియేటర్ రోడ్, కన్యకా పరమేశ్వరీ టెంపుల్ ఏరియా, జహీర్‌పుర తండా, వెంకటల్మీ టాకీస్ రోడ్, సుందరయ్యనగర్, పత్తి మార్కెట్, జహీర్‌పుర, బోస్‌బొమ్మ సెంటర్, మంచికంటి నగర్–2 తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉటుందని ఏఈ మౌలిక తెలిపారు.

అదేవిధంగా నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 కేఈ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ మేరకు బైపాస్ రోడ్, వేణుగోపాల్‌నగర్, బాలాజీనగర్, యూపీహెచ్ కాలనీ, విజయ్‌నగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, కవిరాజ్‌నగర్, గట్టయ్య సెంటర్, ప్రశాంతినగర్, వైరా రోడ్, జెడ్పీసెంటర్, కోర్టు ఏరియా, జమ్మిబండ, సీక్వెల్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ తావుర్యా పేర్కొన్నారు.

**ఖమ్మం అర్బన్:** నగరంలోని టేకులపల్లి, అల్లీపురం సబ్ స్టేషన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా శనివారం చైతన్యనగర్, టేకులపల్లి, ఖానాపురం, టేకులపల్లి డబుల్ బెడ్‌రూమ్స్, వైఎస్ఆర్ నగర్, వెలుగుమట్ల పరిధిలోని అన్ని ఇండస్ట్రీస్‌కు, కొత్తగూడెం, పుట్టకోట, అల్లీపురంలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అశోక్ తెలిపారు.

## భూ కబ్జా చేశారని ఫిర్యాదు


అదనపు కలెక్టర్‌కు వినతి ఇస్తున్న నాగమణి

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఇందిరమ్మ పథకం ద్వారా 2009లో తనకు పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీలో కేటాయించిన 75 గజాల స్థలాన్ని కొందరు కబ్జా చేశారని తాడోజు నాగమణి శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఇల్లు నిర్మించే స్థోమత లేకపోవడంతో కేవలం బేస్‌మెట్ నిర్మించుకున్నానని తెలిపారు. దీంతో కొందరు అందులో ఇల్లు నిర్మించుకున్నందున విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది. వివిధ సంఘాల నాయకులు డాక్టర్ కే.వీ.కృష్ణారావు, బానోతు భద్రూనాయక్, ఉపేంద్రబాయి, ఝాన్సీ, రవీందర్‌నాయక్, జయ, లలితబాయి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి


బుద్ధారం వద్ద పనులను పరిశీలిస్తున్న డీఈ

**నేలకొండపల్లి:** విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అధిగమించేలా మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని బుద్దారంలో ఇటీవల ఈదురుగాలులకు విరిగిన స్తంభాల మరమ్మతులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరగా పనులు చేపట్టాలని తెలిపారు. అలాగే, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ బి.కోట్యానాయక్, ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు వస్తే లైసెన్స్‌లు రద్దు

- స్టాంపు వెండర్లకు జిల్లా రిజిస్ట్రార్ హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..

**నేలకొండపల్లి:** లిఖిత పూర్వకంగా, ఫిర్యాదు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ స్టాంప్ వెండర్లను హెచ్చరించారు. మండలంలో వెండర్లు స్టాంపు పేపర్లకు ధర రెట్టింపు చేసి దోచుకుంటున్న తీరుపై 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'దొరికినంత దోచుడే' కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు విచారణ చేపట్టాలని కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ రామును ఆదేశించడంతో స్టాంపు పేపర్లు కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. అధిక ధరలకు విక్రయిస్తే బాధితులు ఫిర్యాదు చేస్తే లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. కాగా అధిక ధరలకు విక్రయిస్తున్న స్టాంపు వెండర్ల లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని బాధితులు పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# భూసార పరీక్షలపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కూసుమంచి:** సాగు–బాగు ప్రాజెక్టులో భాగంగా కూసుమంచిలోని రైతువేదికలో శుక్రవారం రైతులకు, డేటా ఆఫీసర్లకు భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణపై శిక్షణను అందించారు. ఈ సందర్భంగా కూసుమంచి ఏడీఏ విజయచంద్ర మట్టి సేకరణపై పలు అంశాలను వివరించారు. మట్టి సేకరణ ఎప్పుడు చేపట్టాలి, ఎలాంటి మట్టిని తీసుకోవాలని తదితర విషయాలను వివరించారు. రైతులకు సులభతరంగా భూసార పరీక్షలు చేసేందుకు తగిన శిక్షణను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ వాణి, ఏఈఓలు ప్రియాంక, నిఖిల, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి యశోద పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుడు మృతి


జనార్ధన్‌రావు(ఫైల్)

**నేలకొండపల్లి:** స్వాతంత్ర సమరయోధుడు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కొత్తా జనార్ధన్‌రావు శుక్రవారం మృతి చెందారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా పలు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించిన ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగానూ చాలాకాలం చేశారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం బాధ్యులు రాయల నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, దోసపాటి చంద్రశేఖర్, రేగూరి హన్మంతరావు, కొత్తా రమేష్, కొత్తా సత్యనారాయణ, రేగూరి వాసవి, దోసపాటి కల్పన నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

## రక్తదాన శిబిరం


శిబిరాన్ని నిర్వహిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

**తిరుమలాయపాలెం:** మండలంలోని తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శ్రీశ్రీ కవితమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్లు కృపా ఉషశ్రీ, బొల్లికొండ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సురేష్, సంస్థ ప్రెసిడెంట్ జార్జీ ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

## కేవీపీ రాంచందర్‌రావుకు స్వాగతం


కేవీపీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

**ఖమ్మం రూరల్:** ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ మిత్రుడు, కాంగ్రెస్ నాయకులు కేవీపీ రాంచందర్‌రావుకు ఖమ్మంలో ఘన స్వాగతం పలికారు. శుక్రవారం భద్రాచలం శ్రీరాముని దర్శనానికి వెళ్తున్న ఆయనకు కోదాడ క్రాస్ రోడ్డు వద్ద మాజీ కౌన్సిలర్, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. శ్రీరాములు, యాదగిరి, కార్పొరేటర్ కొప్పెర ఉపేందర్, మాజీ కౌన్సిలర్ హనుమంతరావు, జగదీష్, బొల్లి శెట్టి నాగేశ్వరరావు, సత్యనారాయణ, అశోక్, నల్లపు శ్రీను, నాగిశెట్టి రాధాకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాత కాల్వకు నీరు విడుదల చేయాలి

**నేలకొండపల్లి:** పాలేరు పాత కాల్వకు తక్షణమే నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి రచ్చా నరసింహారావు డిమాండ్ చేశారు. మండలంలోని చుక్కనీరు లేని పాలేరు పాత కాల్వ వద్ద విలేకర్లతో మాట్లాడారు... నీటి తరలింపులో వివక్షత చూపటం తగదన్నారు. పాలేరు పాత కాలువ ఎండిపోతుందని, కానీ ఎడమ కాల్వకు నీటిని సరఫరా చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మందడపు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

**నేలకొండపల్లి:** ఈ నెల 24, 25 తేదీల్లో మండలంలోని బోదులబండ గ్రామంలో జరిగే సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి అన్నారు. మండలంలోని రాజేశ్వరపురంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు... ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ రాసాల కనకయ్య, మందడపు మురళీకృష్ణ, రాసాల నవీన్, యలమద్ది లెనిన్, పి.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## దుస్తుల పంపిణీ

**ఖమ్మం మామిళ్లగూడెం:** న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గరిడేపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఖమ్మంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, లక్ష్మి, శ్రీనివాస్, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

# 'జీరో' బిల్లు కోసం పాట్లు

- దరఖాస్తు చేసుకునేందుకు బారులు
- కేఎంసీలో కౌంటర్ల ఏర్పాటు


దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు

**ఖమ్మంమయూరిసెంటర్:** ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీల్లో గృహ జ్యోతి పథకంను మార్చి 1 నుంచి ప్రారంభించినప్పటికీ అనేక మంది లబ్ధిదారులు ఆ పథకం లబ్ధి పొందలేకపోయారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో కరెంట్ బిల్లులు జీరో రాకపోవడంతో లబ్ధిదారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు విద్యుత్‌శాఖ, కేఎంసీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎన్నికల కోడ్‌తో ఇప్పటి వరకు అధికారులు దరఖాస్తుల స్వీకరణ వాయిదా వేస్తూ వచ్చారు. ఈ మేరకు మరోసారి అర్హుల నుండి గృహజ్యోతికి సంబంధించి దరఖాస్తులను తీసుకొని, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నుండి ఈ ప్రక్రియను కేఎంసీ అధికారులు ప్రారంభించారు.

**భారీగా దరఖాస్తుదారులు..**

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పొందేందుకు లబ్ధిదారులు మరోసారి గృహజ్యోతి పథకం కోసం కేఎంసీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. జీరో బిల్లు రాని వారంతా కేఎంసీకి క్యూ కట్టారు. దీంతో అధికారులు కార్యాలయంలో కౌంటర్లను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తుదారులు బారులుదీరారు.